నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం,19 అక్టోబర్ 2024

మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలు వెంటనే పరిష్కరించాలి

– ఎమ్మెల్సీ ఐ.వేంకటేశ్వరరావు

కాకినాడ, మేజర్ న్యూస్ : మున్సిపల్ యాజమాన్య ఉపాధ్యాయుల సుదీర్ఘ కాలం అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ జిల్లా విధ్యాశాఖ కార్యాలయం వద్ద కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు కె.వి.వి. నగేష్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పెండింగ్లో ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలు తక్షణమే ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలి లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుని వెళ్లడం జరుగుతుందని ఉద్యమానికి పిడిఎఫ్ మద్దతు ఉంటుందని తెలియజేశారు. కాకినాడ, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురం, తుని మున్సిపాలిటీల నుండి సుమారు 100మంది హాజరై నిరసన తెలియజేశారు. జిల్లా అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు కనీసం పిఎఫ్ ను కూడా నిర్వహించలేకపోవడం ఈ ప్రభుత్వం అసమర్ధతకు నిదర్శనం అని తెలియజేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ తక్షణమే ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సబ్ కమిటీ కన్వీనర్ వజ్రపు మహేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.వి. సాయిరాం, జిల్లా ట్రెజరర్ పి.వి.ఎన్. గణేష్, జిల్లా కార్యదర్శిలు పెద్దిరాజు, పి.గిరిధర గోపాల్‌రావు, పి.రాజబాబు, మున్సిపల్ శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు సి.హెచ్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో నిడదవోలు నియోజకవర్గంలో సర్వతోముఖాభివృద్ధి

– "పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా పెరవలి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన..

– రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

– దాదాపు రూ.3 కోట్ల విలువైన 50కి పైగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెరవలి,మేజర్‌న్యూస్ : రాబోయే రోజుల్లో నిడదవోలు నియోజకవర్గంలో సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.. "పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెరవలి మండలాల్లోని పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ఖండవల్లి (గవర్లపాలెం),ముక్కామల, పిట్ల వేమవరం, మల్లేశ్వరం, అన్నవరప్పాడు గ్రామాల్లో పర్యటించిన మంత్రి కందుల దుర్గేష్ దాదాపు రూ.3 కోట్ల విలువైన 50కి పైగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, కొన్ని చోట్ల భూమిపూజలు, మరికొన్ని చోట్ల శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు రాబోయే రోజుల్లో డ్రెయిన్లు, ఆర్ అండ్ బి రోడ్లు వంటి పనులకు ప్రాధాన్యతనిచ్చిన కూటమి ప్రభుత్వం త్వరితగతిన అన్ని పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టనుందన్నారు.

గత పాలకుల తప్పిదాలతో కుంటుపడిన అభివృద్ధి.. సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించిందన్నారు.

గత ఐదేళ్లలో ఎక్కడ తట్టెడు మట్టి వేసిన సందర్భం లేదన్నారు.. గత పాలకులు తప్పిదాల వల్ల రోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన గత పాలకుల మాటలు కోటలు దాటాయి కానీ అభివృద్ధి గడప దాటలేదు అన్నారు.నాడు టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా లబ్ధిదారులకు గత ప్రభుత్వం అందించలేదన్నారు. సరైన లేఅవుట్లు వేయని కారణంగా అవి జలమయమయ్యాయి అన్నారు. సంబంధిత సమస్యను పరిష్కరించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఖజానాను ఖాళీ చేసిందన్నారు. ఈ క్రమంలో కేంద్రంతో మాట్లాడి ఆర్థిక వనరులు సమకూర్చుకొని ముందుగా ప్రధానమైన ఆర్ అండ్ బి రోడ్లపై పడిన గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టామన్నారు.త్వరలోనే పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. కొవ్వూరు డివిజన్లో 11 రోడ్లు రిపేర్ల కోసం నిధులు మంజూరయ్యాయని, ఇప్పటికే టెండర్లు పిలిచామన్నారు. త్వరలోనే గుంతలు పూడ్చివేత కార్యక్రమం పూర్తి అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి రాజధాని, పోలవరానికి చేయూత అందింది అన్నారు. అదే క్రమంలో మిగతా కార్యక్రమాలు సైతం పూర్తి చేస్తామన్నారు. భారీ వర్షాలు,వరదల నేపథ్యంలో ఇసుక తవ్వడానికి వీలు లేకుండా పోయిందన్నారు.. దానికి తోడు సీజన్లో రెండు నెలల పాటు ఇసుక తవ్వకూడదన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల వల్ల సరఫరాలో జరిగిన జాప్యాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. సరళతర విధానంలో ఇసుకను అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.. త్వరలోనే ఇసుక లభ్యత పెరుగుతుందన్నారు తద్వారా భవన కార్మికులకు ఉపాధి పెరుగుతుందని సామాన్యుడు ఇల్లు కట్టుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు.. రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలంగా ఉంటుందన్నారు.. నాణ్యమైన మందు అందించాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు.. గత ప్రభుత్వం నాణ్యతలేని మందు ఇచ్చి జనాలు ఆరోగ్యంతో చెలగాటమాడిందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 15 రోజుల్లోనే రూ.3,000 పెన్షన్ ను రూ.4,000 కు పెంచిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. దివ్యాంగులకు రూ.6 వేలు,మంచానికే పరిమితమైన, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.15 వేలు ఇస్తూ భరోసా కల్పిస్తున్నామన్నారు. నాబార్డ్ నిధులతో గత ప్రభుత్వం రైతులకు పెండింగ్ పెట్టిన బకాయిలు చెల్లించామన్నారు. 120 రోజుల్లోనే పల్లె పండుగ వారోత్సవాలు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సిసి రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు.. 14న ప్రారంభమైన పల్లె పండుగ కార్యక్రమం 20 వరకు కొనసాగుతుందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షమైన పరిపాలన దిశగా ముందుకు వెళ్లడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జెఎన్‌టియుకెలో యూనివర్శిటీ 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో శుక్రవారం ఉదయం విసి కాన్ఫరెన్స్ హాలు నందు జెఎన్‌టియుకె యూనివర్శిటీ 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్ మరియు ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.కె.వి.ఎస్. జి.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా అతిథులుగా వైస్ ఛైర్మన్ & రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ట్రెజరర్ & ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్, స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. సమావేశానికి యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ డా.జి.శ్యామ్ కుమార్ అధ్యక్షత వహించి 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన నివేదికను, చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సందర్భంగాఇన్‌ఛార్జిఉపకులపతి ప్రొ.కెవిఎస్ జి.మురళీకృష్ణ మాట్లాడుతూ జెఎన్‌టియుకె యూనివర్శిటీ తరపున 2024-2025 విద్యాసంవత్సరంలో ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్లలో పాల్గొనే క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి ఉత్తమ ప్రతిభ కనబర్చేలా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం లోని ప్రతిపాదిత అజెండాలోని అంశాలపై 2024-2025 విద్యా సంవత్సరానికి సమర్పించిన బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి తగు చర్యలు చేపట్టేలా అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు డిఏఏ ప్రొ.జి.యేసురత్నం, డిఏపి ప్రొ.బి.బాలకృష్ణ, డిఇ ప్రొ.జి.పద్మజారాణి, ఇఓడబ్ల్యు&జి డైరెక్టర్ ప్రొ.యువి.రత్నకుమారి, సిఇ (పిజి) ప్రొ.డి.హరిత, ఆంధ్రా యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.ఎన్.విజయ్ మోహన్, ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ (సూరంపాలెం) ప్రిన్సిపాల్ డా.శ్రీనివాసరెడ్డి, విజయ కాలేజ్ ఆఫ్ ఫార్మశీ (విజయవాడ) ప్రిన్సిపాల్ డా.కె.పద్మలత, యుసిఇఎన్ ఇంటర్ కాలేజీయేట్ టోర్నమెంట్స్ సెక్రటరీ డా.జి.పి.రాజు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజీ (భీమవరం) ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.పి.సత్యనారాయణ రాజు, లకిరెడ్డి బాలిరెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (మైలవరం) ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎన్‌వి.రాజ్‌కుమార్, సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ (చీరాల) ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏ.శ్రీనివాసరావు, శ్రీ వాసవి ఇంజనీరింగ్ కాలేజీ (తాడేపల్లిగూడెం) ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.లావణ్య, ఫిజికల్ డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు మంత్రిని ఆహ్వానించిన డిసి

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఈనెల 21 నుండి 29 వరకు నిర్వహించనున్న కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలంటూ శుక్రవారం దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్‌రావు ఆహ్వానించారు. అమరావతిలో ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రం అందించడంతోపాటు స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అక్కడ జరుగుతున్న ఏర్పాటు గురించి డిసి ని అడిగి తెలుసుకున్నారు. అక్కడ భక్తులకు ఇబ్బందిగా ఉందా ఎటువంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులపై కూడా ఆరా తీశారు.

రైల్వే లైను ఏర్పాటులో ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలి

– జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

అమలాపురం, మేజర్ న్యూస్ : జాతీయ రహదారి 216, మరియు కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ ఏర్పాటు మూలంగా ఉత్పన్నమైన క్లెయిమ్స్ అభ్యంతరాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా పరిష్కరించుకుంటూ పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్ నందు జాతీయ రహదారులు రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి జాతీయ రహదారి రైల్వే లైన్ అలైన్మెంట్ సమస్యలపై సంప్రదింపులు, భూసేకరణ స్థితిగతులు, సర్వే నివేదికలు, మ్యాపులు అలైన్మెంట్ అభ్యంతరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైలు రోడ్డు మార్గాలు అలైన్మెంట్లో భూములు గృహాలు కోల్పో యిన నిర్వాసితులు అభ్యంతరాలను సామరస్య పూర్వకంగా పరిష్కరిస్తూ పురోగతి సాధించాలని సూచించారు అభ్యంతరాలు పరిష్కారానికి గడువులు విధిస్తూ అధికారులకు తగు సూచనలు చేశారు. సర్వే నెంబర్లు వారిగా రిజిస్ట్రేషన్ విలువలను గణించాలని అదేవిధంగా అలైన్మెంట్లో ఉన్న నిర్మాణాల విలువ లను రహదారులు భవనాలశాఖ ఇంజనీర్లతో గణించాలని ఉద్యాన చెట్లను ఉద్యాన శాఖ అధికారులద్వారా విలు వలు గణించి నష్టపరి హారాల ను చెల్లించాలని ఆదేశించా రు. శివకోడు వద్ద లాకులు దెబ్బతినకుండా అలైన్మెంట్ ను మార్పులు చేయాలని సూచించారు అదేవిధంగా గెద్దాడ వద్ద బరియల్ గ్రౌండ్ కు ప్రహరీ గోడ, అప్రోచ్ రోడ్డుకు అంచనాలు రూపొం దించాలన్నారు. కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్‌కు సంబంధించి కోటిపల్లి- భట్నవిల్లి వరకు అవార్డు పాస్ అయిందని భూములను రైల్వే శాఖకు స్వాధీన పరచాలని ఆదేశించారు అదేవిధంగా అయినవిల్లి వద్ద 13 కిలో మీటర్లు రైల్వే లైన్ స్థలాలను రైల్వే శాఖకు స్వాధీన పరి చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. భట్నవిల్లి-పేరూరు రైలు మార్గానికి సరిహద్దులు రైల్వే ఇంజనీర్లు సర్వేయర్ల సహకారంతో ఏర్పాటు చేయా లని, గుడిమేల్లంకలలో రైలు మార్గం ఏర్పాటుకు భూసేకరణ ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవోలు కే.మాధవి, శ్రీకర్, ఖతీబ్ కౌసర్ భానో, జాతీయ రహదారులు పీడీ సాయి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు సర్వేయర్ బదిలీతో రైతులు ఇక్కట్లు

– పెండింగ్‌లో రీసర్వే సవరణ దరఖాస్తులు

– సర్వేయర్ బదిలీ నిలిపివేయాలని అన్నదాతలు డిమాండ్

గొల్లప్రోలు,మేజర్‌న్యూస్ : రీసర్వేలో పొరబాట్లు సరిదిద్దే ప్రక్రియ వేగవంతమవుతున్న తరుణంలో గొల్లప్రోలు సర్వేయర్ ను వేరే ప్రాంతానికి బదిలీ చేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొల్లప్రోలు పట్టణ పరిధిలోని భూములకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వేలో భూముల విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులు నమోదయ్యాయి. సెంటు భూమి నుండి కొన్ని ఎకరాల భూమి వరకు తప్పుగా నమోదు కావడంతో రైతులు గగ్గోలు పెట్టారు. తప్పుగా నమోదు అయిన భూమి విస్తీర్ణంతోనే పాస్‌బుక్‌లు సైతం మంజూరు చేశారు. మొదట్లో ఈ పాస్ బుక్‌లు తాత్కాలికమేనని అప్పటి ప్రభుత్వం చెప్పినప్పటికీ రీసర్వే పాస్‌బుక్‌లనే (వెబ్ ల్యాండ్-2) అధికారులు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. దీనివల్ల రిజిస్ట్రేషన్లకు, పంట రుణాల మంజూరుకు ఇబ్బందులు తప్పడం లేదు. గొల్లప్రోలులో 90 శాతం మంది రైతుల భూమి విస్తీర్ణం తప్పుగా నమోదు కావడంతో రీసర్వేలో తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకుని గత సంవత్సర కాలంగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులు తిరుగుతూ పడిగాపులు కాసారు. ఈ నేపద్యంలో కూటమి ప్రభుత్వం రీసర్వేను రద్దు చేస్తామని పాత రికార్డులనే (వెబ్ ల్యాండ్-1) ప్రామాణికంగా తీసుకుంటామని ప్రకటించడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం కూడా రీసర్వే రికార్డులనే పరిగణలోకి తీసుకోవడంతో రైతుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇటీవల సంభవించిన వరదలకు ప్రభుత్వం ప్రకటించిన పంట నష్టపరిహారం కూడా రీసర్వేలో నమోదు చేసిన భూమి విస్తీర్ణం ఆధారంగానే మంజూరు చేశారు. దీంతో మరలా రైతులు రీసర్వేలో తప్పుల సవరణకు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు సత్యనారాయణ చొరవతో రైతులు దరఖాస్తు చేసుకున్నసబ్ డివిజన్, మ్యూటేషన్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయి. సర్వేయర్‌గా పనిచేస్తున్న గీసాల వెంకటేష్‌కు గొల్లప్రోలు ఆయకట్టు భూములపై సమగ్రమైన అవగాహన ఉండడం, ఇప్పటికే క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించడంతో సబ్ డివిజన్ దరఖాస్తులు పరిష్కారం అవుతున్నాయి. రీసర్వేలో అస్తవ్యస్తంగా మారిన భూముల రికార్డులు సర్వేయర్ ఒక కొలిక్కి తీసుకువస్తున్న నేపథ్యంలో అకస్మాత్తుగా బదిలీ చేయడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. గొల్లప్రోలు పట్టణమే అయినప్పటికీ సర్వేయర్ లేకపోవడంతో చేబ్రోలు-2 సచివాలయానికి చెందిన వెంకటేష్‌ను గొల్లప్రోలు ఇన్‌ఛార్జ్ సర్వేయర్‌గా నియమించి బాధ్యతలు అప్పగించారు. పెద్ద ఎత్తున దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న సమయంలో భూములపై అవగాహన ఉన్న సర్వేయర్‌ను బదిలీ చేసి కొత్త సర్వేయర్‌ను నియమిస్తే రికార్డులో అవగాహన చేసుకోవడానికి చాలా సమయం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రీ సర్వేలో తప్పుల సవరణ దరఖాస్తులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత సర్వేయర్‌ని కొనసాగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా విజ్ఞాపనల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలి

– అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా సక్రమమైన పరిష్కారాలు అందించాలి

– జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ, మేజర్ న్యూస్ : ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రజా విజ్ఞాపనల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదులపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ట్రైనీ కలెక్టర్ హెచ్ ఎస్.భావనతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ. .రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం అందిన ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్జీదారుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా సక్రమమైన పరిష్కారాలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. గత 15 రోజులలో వచ్చిన దరఖాస్తులపై ప్రతివారం సమీక్షించడం జరుగుతుందన్నారు. ఇందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ సమీక్షలో ఇప్పటివరకు పరిష్కారమైన దరఖాస్తులు, పరిష్కరించినవి సంతృప్తికరంగా ఉన్నయా.. లేవా, ఇంకా ఎన్ని అర్జిలను పరిష్కరించాలి, పరిష్కరించక పోవడానికి గల కారణాలు అన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వివారాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్క ఫిర్యాదు గురించి సంబంధిత అధికారులు పూర్తి అవగాహనతో సమావేశానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ శాఖలకు సంబంధించిన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు తిసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.

హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులు గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలి..జిల్లా స్థాయి అధికారులతో పీజీఆర్ఎస్ సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జేసీ, ట్రైనీ కలెక్టర్ లతో కలిసి హౌసింగ్, జాతీయ ఉపాధి హామీ పథకం పనుల గ్రౌండింగ్, మంచినీరు ట్యాంకులకు క్లోరినేషన్, పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యత తనీఖీ, పీఎం సూర్య ఘర్ వంటి అంశాలపై ఎంపీడీవోలు ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడాలన్నారు. అదేవిధంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు గ్రౌండింగ్ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలన్నారు. అక్టోబర్ చివరనాటికి జిల్లాలో అన్ని ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ యోజనపై మండల స్థాయిలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

బరియల్ గ్రౌండ్, డంపింగ్ యార్డ్, పారిశ్రామికరణకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలి..

జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. జేసీ, ట్రైనీ కలెక్టర్‌లతో కలిసి జిల్లాలోని వివిధ రెవెన్యూ అంశాల ప్రగతి, డంపింగ్ యార్డ్స్, బరియల్ గ్రౌండ్స్, జాతీయ రహదారులు, పారిశ్రామికరణకు అవసరమైన భూమి గుర్తింపు వంటి అంశాలపై మండల స్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో మండలస్థాయి అధికారులు రెవిన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రగతి కనపరచాలన్నారు. ప్రాముఖ్యంగా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసే విధంగా మండల పరిధిలో పారిశ్రామికరణకు, బరియల్ గ్రౌండ్స్, డంపింగ్ యార్డ్, జాతీయ రహదారులకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సమావేశంలో జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు, ఎంపీడీవో, తహసీల్దార్లు, హౌసింగ్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ జిజిహెచ్ హాస్పిటల్ డైరెక్టర్‌గా రావు అక్షయ్ నియామకం

యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ : కొత్తపల్లి మండలం వాకతిప్ప గ్రామానికి చెందిన రావు అక్షయ్‌కి కాకినాడ జిజిహెచ్ హాస్పిటల్ డైరెక్టర్‌గా నియమించడం చాలా ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మొదటి నుంచి నేటి వరకు తెలుగుదేశం ప్రభుత్వం అలాగే జనసేన ప్రభుత్వానికి ముఖ్యంగా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగానే ఉన్నారు, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారు. ఆయన కష్టపడ్డ కష్టానికి ప్రతిఫలంగా నేడు ఆయనకి అప్పగించిన ఆ పదవే ఉదాహరణ అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆయనకి ఈ పదవి రావడం పట్ల కొత్తపెళ్లి మండలం ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతపై దృష్టి పెట్టి ప్రతిఒక్కరికి మేలు చేయడమే నా లక్ష్యం అని రావు అక్షయ్ అన్నారు. ఆయన వెంట కూటమి ప్రభుత్వ నాయకులు,ఆయన అభిమానులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంపు మండలాలను కలుపుతూ ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి

ఎటపాక, మేజర్ న్యూస్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముంపు మండలాలను కలుపుతూ ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి అని అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి మువ్వా శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహిళ & శిశు సంక్షేమ శాఖ & గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని అరకు పార్లమెంట్ అధికారి ప్రతినిధి మువ్వా శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా కప్పి సన్మానించడం జరిగింది. అనంతరం విలీన మండలాల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పటం వల్ల ముంపు మండల ప్రజలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారో, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 350 కిలోమీటర్లు ప్రయాణం చేయవల్సి వస్తుంది అని, ఇదే విషయాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి తెలియజేయడం జరిగింది అని, ముంపు మండలాలను కలుపుతూ ప్రత్యేక జిల్లా ప్రకటిస్తాని ఆయన హామీ

మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన

పెద్దాపురం, మేజర్‌న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, వరహాలు, క్రాంతివీర్, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ చింతా అనురాధ జన్మదిన వేడుకలు

అమలాపురం, మేజర్ న్యూస్ : మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. సందర్భంగా అల్లవరం మండలం మొగళ్లమూరులోని క్యాంపు కార్యాలయంలో చింతా అనురాధని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, శ్రేయోభిలాషులు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినవారిలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, ఏపీ స్టేట్ అగ్రీకల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి బాబీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ, చెల్లుబోయిన శ్రీనివాస్, గొల్లపల్లి డేవిడ్, జెడ్పీటీసీలు కొనుకు గౌతమి, మట్టా శైలజ, ఎంపీపీ ఇళ్ల శేషారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో విస్తృత సేవలు

– గవర్నర్ డా॥ వెంకటేశ్వరరావు

కాకినాడ, మేజర్ న్యూస్ : రోటరీ క్లబ్బుల ఆధ్వర్యంలో సమాజానికి అవసరమైన విస్తృత సేవా కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టామని రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు (విజయనగరం) అన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో మదర్స్ మిల్క్ బ్యాంక్, మొబైల్ బర్నింగ్ యూనిట్, బాలికల విద్య ఉపాధి అవకాశాలపై శిక్షణతోపాటు పోలియో నిర్మూలనకు విస్తృతంగా పనిచేయడం వంటి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. మన అభివృద్ధి దేశాభివృద్ధి అనే నినాదంతో రోటరీ డిస్ట్రిక్ట్ పరిధిలో ఉన్న 86 రోటరీ క్లబ్బులు చే వివిధ కార్యక్రమాలను నిర్వహించే విధంగా పలు ప్రాజెక్టులను రూపొందించామని ఆయన వివరించారు. ప్రతి క్లబ్బు శాశ్వత ప్రాజెక్టులను నిర్వహించడం ద్వారా సమాజానికి ఎంతో సేవ చేస్తున్నవారు అవుతారని, అందులో భాగంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వర్రావు అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పర్మనెంట్ సేవా ప్రాజెక్టులను శుక్రవారం ఉదయం ఆయన సందర్శించారు. ఇప్పటివరకు అంతర్జాతీయ రోటరీ ఆధ్వర్యంలో పోలియో నిర్మూలనకు 14 వేల కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగిందని గుర్తు చేశారు. ఇటీవల జరిగిన కొన్ని ప్రాంతాలలో తిరిగి పోలియో లక్షణాలకు గుర్తించడం జరిగిందని వాటి నిర్మూలన కూడా రోటరీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని చెప్పారు. దేశంలో 2.7 మిలియన్ పిల్లలకు పోలియో వ్యాక్సిన్ అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. తొలుత అచ్చంపేట

గ్రామంలో నిర్వహిస్తున్న రోటరీ రక్షిత మంచినీళ్ల పథకాన్ని ఆయన సందర్శించారు అక్కడ ప్రజలతో కొద్దిసేపు మాట్లాడుతూ మంచినీటి సేవనంతోనే చాలా మటుకు రోగాలు నుండి కాపాడుకోగలం అన్నారు. అనంతరం రోటరీ వృద్ధాశ్రమాన్ని గవర్నర్ వెంకటేశ్వరరావు సందర్శించగా ఆయనకు వృద్ధాశ్రమ కమిటీ చైర్మన్ ప్రముఖ న్యాయవాది జి.వి. కృష్ణ ప్రకాష్ స్వాగతం పలికారు. అనంతరం మొక్క నాటే కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. వృద్ధాశ్రమ నిర్వహణ విషయాలను కార్యదర్శి ముంజులూరి విశ్వేశ్వరరావు వివరించారు. అనంతరం గవర్నర్ వృద్ధాశ్రమ భవనాన్ని మరియు అందులో నివాసముంటున్న మహిళలను కలిసి మాట్లాడారు. తర్వాత ఏర్పాటైన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా మహిళలు వ్యాయామము చేయాలని సూచించారు. జి.వి కృష్ణ ప్రకాష్ మాట్లాడుతూ మహిళలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అదేవిధంగా సోలార్ సిస్టం కూడా ఏర్పాటు చేయాలన్న ఆలోచన తమకున్నదని ఈ రెంటి ప్రాజెక్టులకు దాతలు తమ వంతు సహాయాన్ని ప్రకటించారని రోటరీ డిస్ట్రిక్ట్ నుండి కూడా ఆర్థిక సహకారాన్ని అందించాల్సిన విజ్ఞప్తి చేశారు. రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్, కార్యదర్శి డి.శ్రీకాంత్, కోశాధికారి పి.స్వరూప రాజ్, చెలికాని సూర్యారావు, వడ్డాది ఆదిత్య, చోడిశెట్టిపద్దరాజు, సత్తి రవి రెడ్డి, ఉషారాణి, పద్మజావాణి, చార్మినార్ వర్మ, సుబ్రహ్మణ్యేశ్వర రావు, డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు, డాక్టర్ టీవీ బాలకృష్ణ, నెక్కంటి శ్రీనివాస్, కోటగిరి నాని, డి.సాయి కృష్ణ, డాక్టర్ వైవి పరశురామ్, బుచ్చిరెడ్డి, బళ్ళ సత్యపాల్‌తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విజయభేతాళ ఉత్సవం

- జనసంద్రంగా తీర్థం
- ఆకట్టుకున్న వాహన మహోత్సవం

అంబాజీపేట, మేజర్ న్యూస్ : విజయబేతాళస్వామి ఉత్సవాలు కనులవైకుంఠంగా సాగాయి. అంబాజీపేటలో 13 పాలాలకు చెందిన వివిధ రకాల గ్రామమూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ స్థానిక సెంటరులో కొలువుదీరి భక్తులను కనువిందు చేశాయి. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే బేతాళస్వామి సంభరాలు శుక్రవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ అట్టహాసంగా, కన్నుల విందుగా సాగాయి. శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీ విజయబేతాల స్వామి ఆలయం వద్ద నుండి ఈ సంబరాలు ప్రారంభమయ్యాయి. 13 పాలాలా నిర్వాహకులు దేవతామూర్తులను వాహనాలపై పెట్టి రంగురంగుల విద్యుతీపాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మేళతాళాలు, బాజా భజంత్రీల పురవీధుల్లో ఊరేగించారు. వాహనాల ముందు చేడీ తాళింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు చేసిన విన్యాశాలు గగుర్పాటుకు గురిచేశాయి. గరగ నృత్యాలు, కొబ్రా, శక్తి వేషాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్థానిక సెంటర్ లో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా అమలాపురం డీఎస్పీ వై.మాధవరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు పర్యవేక్షణలో ఎస్సై కె.చిరంజీవి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. బేతాళ స్వామినిపి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు దర్శించుకున్నవారిలో ఉన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం కేసులో ముద్దాయి అరెస్ట్

- స్కూటీపై పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితుడు
- ముద్దాయి వద్ద నుండి కత్తి సీజ్ చేశాం
- పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్

పిఠాపురం, మేజర్ న్యూస్ : వ్యక్తిపై హత్యాయత్నం చేసి, సదరు వ్యక్తి తప్పించుకోవడంతో అతని ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తున్నామని పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాస్ తెలిపారు. ది.16 అక్టోబర్ 2024 వ తేదీ సాయంత్రం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల జగ్గయ్య చెరువు కాలనీ సత్తెమ్మ తల్లి గుడి దగ్గరలో, మేడిశెట్టి రామక్రిష్ణ ఆను ఆసామి తన అన్నయ్య మేడిశెట్టి బాబ్జితో గొడవ పడుతుండగా... పసుపులేటి శ్రీనివాసురావు ఆను వ్యక్తి అడ్డుకోగా... అతడు వాళ్ళ అన్నయ్యకు సపోర్ట్ చేస్తున్నాడనే ఉద్దేశంతో మేడిశెట్టి రామక్రిష్ణ సదరు పసుపులేటి శ్రీనివాసురావును చంపాలనే ఉద్దేశంతో కత్తితో దాడి చేయగా శ్రీనివాస్ తప్పించుకునేసరికి అతని యొక్క ద్విచక్ర వాహనం (స్కూటీ) పై పెట్రోల్ పోసి కాల్చివేసిన సంఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో హత్య యత్నం క్రింద నమోదు అయిన కేసు క్రైమ్ నెంబర్ 217/2024 యు/ఎస్ 109, 324(4) బి.ఎన్.ఎస్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దర్యాప్తులో భాగంగా... కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశముల మేరకు, ఎస్ డి పి ఓ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాసు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయిల కోసం ముమ్మరంగా గాలించి, సదరు కేసులో ముద్దాయిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. సదరు ముద్దాయి అయిన మేడిశెట్టి రామకృష్ణ, తండ్రి అప్పారావు, వయస్సు (43) కులం, శేట్టిబలిజ, జగ్గయ్య చెరువు పిఠాపురం అను వ్యక్తిని 18 అక్టోబర్2024 వ తేదిన ఉదయం తన ఇంటి వద్ద అరెస్టు చేసి, తన వద్ద నుండి కత్తి ని సీజ్ చేశామని, ముద్దాయికి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ సమావేశంలో పిఠాపురం పట్టణ ఎస్సై వి. మణికుమార్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని సిపిఎం ధర్నా

కాకినాడ, మేజర్ న్యూస్ : విద్యుత్ చార్జీల పెంపుదలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడ కుళాయిచెరువు వద్ద ఉన్న ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో 8,114 కోట్ల రూపాయల భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపిందని విమర్శించారు. కరెంట్ బిల్లులే కాకుండా ఫిక్స్డ్ చార్జీలు, కస్టమర్ చార్జీలు, సర్ చార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు చార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారని, అసలు చార్జీల కంటే కొసరు చార్జీలు ఎక్కువయ్యాయని, గతంలో వాడుకున్న కరెంటుకు కూడా చార్జీలు చెల్లించాలని అంటున్నారని తెలిపారు. విద్యుత్ రంగాన్ని అదాని తదితర బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని నాగేశ్వరరావు విమర్శించారు. విదేశాలకు బొగ్గు సరఫరా చేసేది, బొగ్గు రవాణా చేసే ఓడరేవులు అదానీవేనని, ఇప్పుడు తాజాగా స్మార్ట్ మీటర్లు తయారు చేసే కంపెనీని అదానీ ప్రారంభించారని తెలిపారు. ఇలా విద్యుత్ రంగం మొత్తాన్ని అదానీ, కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్ళేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని నాగేశ్వరరావు విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా హిందూజా సంస్థకు 1200 కోట్ల రూపాయలను అప్పనంగా చెల్లించారన్నారు. ఈ స్మార్ట్ మీటర్లతో అదాని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకే ప్రయోజనమని ప్రజలకు నష్టం, భారం అవుతుందని, అందుకే దీనిని ఆదిలోనే తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఇన్చార్జ్ డిఇకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దువ్వ శేషబాబ్జి, కె.ఎస్.శ్రీనివాస్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పలివెల వీరబాబు, సి.హెచ్. రమణి, మలకా రమణ,కె.వీరబాబు, కె.సింహాచలం, టి.రాజా, పి.రామకృష్ణ, కె.సత్తిరాజు, టి.ఈశ్వరరావు, వి.రాజబాబు, సి.హెచ్.విజయకుమార్, సురేష్, ఎ.ఏడుకొండలు, భూలక్ష్మి, చైతన్య రెడ్డి, రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా

పెద్దాపురం, మేజర్‌న్యూస్ : ట్రూఅప్ చార్జీలు పేరుతో ప్రజలపైన 20వేల కోట్ల రూపాయలు భారం వేయడం అన్యాయమని, తక్షణం వాటిని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం పెద్దాపురం మండల కమిటి ఆధ్వర్యంలో పెద్దాపురం విద్యుత్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గతంలో వైసిపి ప్రభుత్వంపై కరెంటు ఛార్జీలు ప్రజల నెత్తిన బాదేసిందని, మేము అధికారంలకి వస్తే కరెంటు ఛార్జీల పెంపుదల ఉండదని అన్నారని, కాని నేడు అదే కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తి మీద ట్రూఆప్ ఛార్జీలు పెంపుదల చేసేందుకు రంగం సిద్ధం చేసిందని ఆయన విమర్శించారు. విద్యుత్ నియంత్రణ మండలి పేరుతో తూతూ మంత్రంగా బహిరంగ విచారణ జరిపి ప్రజలపైన భారాలు వేయడానికి సిద్ధపడడం అన్యాయమన్నారు. 2022-23 సం.లో వాడుకున్న కరెంటుకు కరెంటు బిల్లులు కట్టేసినా, సరిపోలేదు మరలా కట్టండి అని తెలుపుతూ ట్రూఆప్ చార్జీలు వేయడం అన్యాయమన్నారు. దీనిని సిపిఎం పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ట్రూఆప్ చార్జిలు తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జిల పెంపుదల నిరసిస్తూ విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు కేదారి నాగు, సిరపురపు శ్రీనివాస్, మరిడయ్య, సత్యనారాయణ, కృష్ణ, అప్పన్న, వీర్రాజు, పెంటయ్య, రమణ, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిపిస్తే చట్టపరమైన చర్యలు

– సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలో ఎవరైనా బాల్యవివాహాలు జరిపినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్, బాల్య వివాహాల నిర్మూలన చైర్ పర్సన్ కెఆర్ కల్పశ్రీ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలన కోసం ఐసిడిఎస్ సిడిపిఓ, ఏడియం అండ్ హెచ్ఓ, సర్కిల్ ఇన్ స్పెక్టర్, మండల విద్యాశాఖ అధికారి, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి, వెలుగు డిపిఎం, అంగన్వాడీ సూపర్వైజర్లతో సబ్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా ఎవరైనా పెళ్లిళ్లు చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అన్ని పాఠశాలలు, అన్ని గ్రామాలలో బాల్య వివాహాల నిర్మూలన కొరకు అవగాహన కల్పించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిస్తే సంబంధిత అంగన్వాడీ టీచర్‌కు, పోలీస్ స్టేషన్లో, మహిళా సంఘాలకు, మండల విద్యాశాఖ అధికారికి తెలియజేస్తే సత్వరమే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బాల్య వివాహాల నిర్మూలన చట్టం 2006 ప్రకారం ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహించినా, ప్రోత్సహించినా వారిపై వెంటనే పోలీసు కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నప్పుడు 109, 100, 1098 టోల్ ఫ్రీ నెంబర్లకు తెలియజేయాలని ఏజెన్సీ ప్రజలను సబ్ కలెక్టర్ కోరారు. మార్గదర్శి ప్రోగ్రాం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు డ్రాప్ అవుట్లు కాకుండా చూడాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా అబ్బాయి అమ్మాయి తల్లిదండ్రులను బాల్య వివాహాల చట్టాల గురించి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన వాల్ పోస్టర్లు సబ్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సంధ్యారాణి, ఎడియం అండ్ హెచ్ఓ జి.శిరీష, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామ తులసి, మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణ, వెలుగు డిపిఎం పరమేశ్వరరావు, హెల్త్ మానిటరింగ్ సెల్ అధికారి ఝాన్సీ, రమణి, అంగన్వాడీ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

22 నుండి రెవెన్యూ గ్రామ సభలు

– తహశీల్దార్ వెంకటలక్ష్మీ

పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలంలో ఈ నెల 22వ తేది నుండి నవంబర్ 21 వ తేది వరకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించబడునని పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెం కటలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండలంలో రీసర్వే పూర్తి అయిన గ్రామాలలో ఈ గ్రామ సభలు నిర్వహించబడునని ఆమె తెలిపారు. 22వ తేదిన సిరివాడ, 23వ తేదిన గోరింట, 24వ తేదిన వడ్లమూరు, 25వ తేదిన పులిమేరు, 26వ తేదిన దివిలి, 29వ తేదిన చదలాడ, నవంబర్ 2వ తేదిన చంద్రమాంపల్లి, 5వ తేదిన తిరుపతి, 6వ తేదిన తాటిపర్తి, 7వ తేదిన ఉలిమేశ్వరం, 8వ తేదిన మర్లావ, 12వ తేదిన కాండ్రకోట, 13వ తేదిన గుడివాడ, 14వ తేదిన ఆర్.బి.పట్నం, 16వ తేదిన వాలుతిమ్మాపురం ఆయా గ్రామాలలో ఈ గ్రామ సభలు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించబడునని తహశీల్దార్ వెంకటలక్షీ తెలిపారు.

తంటికొండ పంచాయతీలో కార్యాలయాలు ఆకస్మికంగా తనిఖీ చేసిన స్పెషల్ అధికారి

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని తంటికొండ పంచాయతీ లోనిపలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం మండల స్పెషల్ అధికారి జాన్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ సచివాలయం, సబ్ సెంటర్, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అలానే నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీని పరిశీలించి వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరిశ్వరరావు,గ్రామ సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీను, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సెట్రాజ్ ఆధ్వర్యంలో నైపుణ్య పోటీలు

అమలాపురం,మేజర్‌న్యూస్ : జిల్లా స్థాయి యువజనోత్సవములను స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజనోత్సవములలో భాగముగా శుక్రవారం యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్, కాకినాడ వారి అద్వర్యములో యువతీయువకు లలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి తమ నైపుణ్యమును ప్రదర్శించుకొనుటకు వీలుగా 15-29 సంవత్సరముల మధ్య వయస్సుగల యువతీయువకులకు నేపద్య విభాగములోని "సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణ"లో నేపద్య పోటీలు, సాంస్కృతిక విభాగములలో జానపద నృత్యం (బృందం), జానపద నృత్యం (సోలో), జానపద గేయం (బృందం) జానపద గేయం (సోలో), కథ వ్రాయడం, కవిత్వం, పెయింటింగ్ మరియు డిక్లమేషన్ పోటీలను, యువకృతిలో విభాగములో హస్తకళల కళాకారులకు పోటీలు శ్రీయుత జిల్లా కలక్టర్ వారి ఆదేశముల మేరకు డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2024ను అంబేద్కర్ భవన్, అమలాపురం నందు నిర్వహించుట జరిగినది. జిల్లా స్థాయి యువజనోత్సవములను డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలక్టరు టి.నిశాంతి జ్యోతిప్రజ్వలన చేసి, పోటీలలో పాల్గొనుటకు విచ్చేసిన వివిధ కళాశాలల విద్యార్దినీవిద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుచూ స్వామి వివేకానంద వారిని ఆదర్శముగా తీసుకొని చదువుతోపాటు సంస్కృతిక, క్రీడా పోటీలు మరియు సామాజిక సేవ కార్యక్రమాలలోనూ పాల్గొనవలసినదిగా పిలుపునిచ్చారు. ఈ పోటీలలో పాల్గొనడానికి 821 మంది యువతీయువకులు ఆన్‌లైన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకొన్నారు. ఈ కార్యక్రమములో డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలక్టరు టి.నిశాంతి, సెట్రాజ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, కె.ఎస్.వి. కాశీ విశ్వేశ్వరరావు, న్యాయ నిర్ణేతలు మరియు సెట్రాజ్ సిబ్బంది పాల్గొన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆవిష్కరణలో ఐ. మధుసాయి ప్రథమ స్థానం, టి. లక్ష్మీ శిరీష్ ద్వితీయ స్థానం, జె.మనోజ్ తృతీయ స్థానం; జానపద నృత్యం (గ్రూపు)లో పావన్ & గ్రూప్ ప్రథమ స్థానం, వి.కె.వి. గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ద్వితీయ స్థానం, హరిత & ఎఎస్ఎమ్ కాలేజ్ తృతీయ స్థానం; జానపద నృత్యం (సోలో)లో వై. మంజీర ప్రథమ స్థానం, కుసుమ సౌమ్య ద్వితీయ స్థానం, దుర్గా మహా కల్యాణి తృతీయ స్థానం; జానపద గేయాలు (గ్రూపు)లో రామచంద్రపురం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రథమ స్థానం నవ్య & గ్రూప్ ద్వితీయ స్థానం, బత్తుల అనూష తృతీయ స్థానం; జానపద గేయాలు (సోలో)లో సిద్దం శ్రీదేవి ప్రథమ స్థానం, బాబీ ద్వితీయ స్థానం, పి.చర్మిలా దీక్షిత తృతీయ స్థానం; కథ వ్రాయడంలో ఆర్.లక్ష్మీ సిందూజా ప్రథమ స్థానం, ఎన్.హేమమాలిని ద్వితీయ స్థానం, కె. సౌమ్య తృతీయ స్థానం; పెయింటింగ్‌లో పి.యెడిమల్ల రాజు ప్రథమ స్థానం, కె. శ్రావ్య ద్వితీయ స్థానం, జి. జీవన్ కుమార్ తృతీయ స్థానం; కవిత్వములో ఎన్.హేమమాలిని ప్రథమ స్థానం, పి.మణికంట ద్వితీయ స్థానం, జి. దివ్యశ్రీ తృతీయ స్థానం; ఉపన్యాసంలో ఎమ్. ప్రియాంకా ప్రథమ స్థానం, ఎన్.హేమమాలిని ద్వితీయ స్థానం, వి బాల ఆదిత్య తృతీయ స్థానం; యువకృతిలో జి.కల్యాణి ప్రథమ స్థానం, ఎమ్. శ్రీచరణ్ ద్వితీయ స్థానం, కె. స్వాతి తృతీయ స్థానంలలో విజేతలుగా నిలచారు.

ప్రజలపై మోపిన ట్రూ అప్ చార్జీల భారాన్ని వెనక్కి తీసుకోవాలి

- స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలి
- సీపీఎం డిమాండ్

సామర్లకోట, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై విధించిన ట్రూ అప్ చార్జీల ను వెంటనే రద్దు చేయాలని సిపిఎం పట్టణ కమిటీ సామర్లకోట ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా శుక్రవారం నిర్వహించి అనంతరం ఎలక్ట్రికల్ డి ఈ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం పట్టణ కార్యదర్శి కరణం ప్రసాద్ రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్యాయంగా ప్రజలపై విద్యుత్ వారాలు మోపిందని చంద్రబాబునాయుడు ఎన్నికల సందర్భంగా తీవ్రంగా విమర్శించి నాడు అధికారంలోకి వస్తే వెంటనే ట్

ఆసుపత్రిని పరిశీలించిన డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : నిరంతర పర్యవేక్షణలో భాగంగా కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉపాధికారి పి. సరిత ఏలేశ్వరం అమ్మ ఆసుపత్రిని సందర్శించారు. వైద్య అధికారులతో కలిసి లింగంపర్తి రోడ్‌లో గల అమ్మ ఆసుపత్రిని అక్కడ ఏర్పాటు చేసిన నూతన వైద్య పరికరాలను, వాటికి సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఆన్లైన్‌కి సంబంధించి డేటా ఎంట్రీ తదితర అంశాలపై ఆసుపత్రి సిబ్బందికి సలహాలు అందజేశారు. అనంతరం వైద్య పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఆసుపత్రి నుంచి నూతన పరికరాలు ఏర్పాటుకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవడం జరిగిందని వాటిని పరిశీలించి వైద్య ఆరోగ్య సబ్ కమిటీ, జిల్లా కమిటీ నిర్ణయం మేరకు ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

మండలంలోని అన్ని పంచాయతీలలో డ్రై డే, ఫ్రైడే కార్యక్రమం

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలానికి చెందిన అన్ని పంచాయతీ గ్రామాలలో వైద్య సిబ్బంది శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు మెకానిక్ షెడ్ బయట ఉన్న. టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, నివాస ప్రాంతాలు చుట్టూ ఉన్న ప్రదేశాల్లో నీటి నిల్వ లేకుండా అలానే మురుగునీరు లేకుండా చూసుకోవాలని వైద్య సబ్బంది సూసించారు. అలానే అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ప్రదేశాల్లో స్వచ్ఛందంగా పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి శ్రమమాధానం చేశారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

"ఇండస్ట్రీ 4.0" అంశంపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కాకినాడ, మేజర్ న్యూస్ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో సెనేట్ హాలు నందు యూనివర్శిటీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె)లోని కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఏఐ&ఎంఎల్ ఆధ్వర్యంలో "ఇండస్ట్రీ 4.0" అను అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి)ది.18.10.2024 శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగావిచ్చేయగా గౌరవ అతిథులుగా రెక్టార్ ప్రొ.కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ. వి.రవీంద్రనాథ్, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావు, రీసోర్స్‌పర్సన్స్‌గా విశాఖపట్నం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లోని మెకట్రానిక్స్ విభాగాధిపతి డా.కె.మురళీకృష్ణ, ఫైటెక్ ఎంబెడెడ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ డా.బి.వల్లభ్‌రావు, అతిథులుగా యుసిఇకె ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ.ఎన్.మోహన్‌రావు, సిఎస్ఈ ఇన్‌ఛార్జి విభాగాధిపతి డా. ఏ.కరుణలు వేదికనలంకరించారు. ఎఫ్‌డిపి ప్రోగ్రామ్‌కు ఐటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొ. ఎ.ఎస్.ఎన్.చక్రవర్తి, సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డా. ఎల్.సుమలతలు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తుండగాడా.టి.శివరామకృష్ణ,డా.ఇ.సునీత కో-కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ. కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రస్తుతం ఆదరణలో ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఐఓటి, డేటా సైన్స్, రోబోటిక్స్, త్రీడి ప్రింటింగ్, డ్రోన్ టెక్నాలజీ, ఆగ్యుమెంటెడ్ రియాల్టీ (ఏఆర్), వర్చువల్ రియాల్టీ (విఆర్) తదితర కోర్సులు

పరిశ్రమలకు అనుగుణంగా అధ్యాపకులు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల ద్వారా ఆధునిక సాంకేతిక అంశాలపై వృత్తిపరమైన అవగాహన పొందాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఇటీవల ప్రస్తావించిన ఇండస్ట్రీ రెడీ కోర్సులకు సంబంధించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నందుకు ఎఫ్‌డిపి కో-ఆర్డినేటర్లను అభినందించడం జరిగిందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో అనేక మంది విద్యార్థులు సాంకేతికపరంగా ఆదరణలో ఉన్న కోర్సులలో చేరుతున్నారని, వారిని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం ద్వారా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించవచ్చునన్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత సాంకేతికతలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు విద్యావ్యవస్థ మరియు పరిశ్రమల మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.రెక్టార్ ప్రొ.కెవి.రమణ మాట్లాడుతూ ఎఫ్‌డిపి ద్వారా

పరిశ్రమలకు అవసరమైన ఆధునిక సాంకేతికతలు, ఐఓటి సెన్సార్‌లు, పరికరాలు, క్లౌడ్ ప్లాట్‌ఫారమ్‌ల గురించి అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ప్రయోగాత్మక అనుభవంతో పాటు విభిన్న కేస్ స్టడీలపై చర్చించేందుకు అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు అవకాశం లభిస్తుందన్నారు.ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యాసంస్థ మరియు పరిశ్రమల అనుసంధానం ద్వారా విద్యార్థులకు బోధన, అభ్యాసన పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించేందుకు వీలు కలుగుతుందన్నారు. రీసోర్స్‌పర్సన్స్‌గా పాల్గొన్న డా.కె.మురళీకృష్ణ, డా.బి.వల్లభ్‌రావులు పరిశ్రమలలో అనుసరించే పలు సాంకేతికత పద్ధతులను, డ్రోన్ టెక్నాలజీ, పరిశ్రమల సుస్థిరాభివృద్ధి కోసం విద్యాసంస్థ మరియు పరిశ్రమల అనుసంధానంపై అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, విభాగాధిపతులు,యుసిఇకె అధ్యాపకులు, అనుబంధ కళాశాలలఅధ్యాపకులు,పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అమలాపురం, మేజర్ న్యూస్ : గ్రామాల్లో రోడ్లు ఇతర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 10 గ్రామాలలో సుమారు 1 కోటి 46 లక్షలతో చేపట్టబోయే రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనాకాలంలో రహదారి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. అనేక గ్రామాల్లో కనీస రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ పనులన్నీ స్వల్ప కాలంలో పూర్తిచేసి ప్రజలకు అనతి కాలంలోనే అందుబాటులోకి తెస్తామని వివరించారు. భవిష్యత్తులో గ్రామాల సమగ్ర స్వరూపాన్ని మార్చేలా అనేక పథకాలకు రూపకల్పన చేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వెలువలపల్లి గ్రామంలో స్థానిక సమస్యలను ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కుడిపూడి దుర్గారావు, టిడిపి నాయకుడు మద్దాల సుబ్బారావు, మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు, కల్లేపల్లి సుబ్బరాజు, బడుగు భాస్కర్, జోగేష్, నేదునూరి వీర్రాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు సలాది బుచ్చిరాజు, మద్దా చంటిబాబు, అడపా నాగభూషణం, మేడిద దుర్గా ప్రసాద్ పడాల గిరి పాల్గొన్నారు

లయన్స్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్‌కు శంకుస్థాపన

రాజమండ్రి,మేజర్‌న్యూస్ : గత ఆరు దశాబ్దాలకు పైగా లయన్స్ క్లబ్ రాజమహేంద్రవరం ప్రజాహిత కార్యక్రమాలు చేస్తూ ప్రజలచేత మన్ననలను పొందుతున్నదని క్లబ్ అధ్యక్షులు మద్దుల వి.ఎస్. శ్రీరామ గుప్త అన్నారు. ప్రస్తుతం ఆనంద్ రీజన్సీ సమీపాన నిత్యం జనసందోహంతో ఉండే నందం గనిరాజు (ఐదు రోడ్లు) జంక్షన్లో క్లబ్ ఆధ్వర్యంలో బస్ షెల్టర్ నిర్మించదలిచామని చెప్పారు. అందుకు నగరపాలక సంస్థచే ఇవ్వబడిన స్థలంలో ఇటు విశాఖపట్నం, కాకినాడ, గోకవరం నుంచి వచ్చే బస్సు ప్రయాణికులకు అనువైన ప్రదేశంలో బస్ షెల్టర్ నిర్మాణమునకు భూమిపూజ చేయడం జరిగిందని చెప్పారు. ప్రధాన దాత అయిన గొల్లపూడి వెంకటరమణ చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించామన్నారు. ఈ బస్సు షెల్టర్ నిర్మాణానికి రాజమహేంద్రవరం నగరపాలక కమిషనర్ మరియు ఆర్టీసీ డిపో మేనేజర్ క్లబ్‌కు సహకరించారని వివరించారు. ఇందుకు గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్స్ ఆర్థిక సహకారంతో ఒక లక్షా 70వేలు వ్యయమవుతుందని, ఈ షెల్టర్ డిశంబర్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అర్ధరాత్రి బస్సు దిగి వచ్చే ప్రయాణికులకు సదుపాయంగా ఇందులో లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని, అక్కడ నివసించే ఆటో స్టాండ్ ప్రెసిడెంట్ దాసు, వారి ఆటో డ్రైవర్ యూనియన్ అందరూ కూడా సహకరించుటకు సమ్మతించారని చెప్పారు. భూమి పూజ కార్యక్రమం సెక్రెటరీ కుమార్ స్వామి, ట్రెజరర్ రాఘవరావు, సీనియర్ మెంబర్ గోపాలకృష్ణ, నాగిరెడ్డి, ప్రీతం, క్లబ్ అడ్మిన్ గ్రంధి లక్ష్మీ వసంతకుమారి మరియు పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు తదితరులు పాలొన్నారు.

అట్టహాసంగా ప్రారంభమైన 68వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు

- క్రీడా పోటీలను లాంచనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

కాకినాడ, మేజర్ న్యూస్ : నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే 68వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటున్న వివిధ జిల్లాల విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడంతోపాటు ఆత్మ విశ్వాసంతో పోటీలలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం కాకినాడ పట్టణం రాజా ట్యాంకు వద్ద ఉన్న స్కేటింగ్ ఇండోర్ స్టేడియంలో పాఠశాల విద్యాశాఖ క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలను జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి ప్రారంభించారు. రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ ప్రారంభోత్సవం సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్ షణ్మోహన్ జాతీయ జెండాను, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్..ఆంధ్రప్రదేశ్ పాఠశాల క్రీడా సమాఖ్య జెండాను, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు.. జిల్లా క్రీడా సమాఖ్య జెండాను ఎగురువేసి, క్రీడాకారులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ 68వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ అండర్ - 11, 14, 17, 19 బాల బాలికలకు నిర్వహిస్తున్న ఈ స్కేటింగ్ పోటీలు నేటి నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలకు సంబంధించి 13 జిల్లాల నుంచి సుమారుగా 400 మంది క్రీడాకారులు ఈ పోటిలలో పాల్గొనడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటున్న వివిధ జిల్లాలకు చెందిన విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడంతోపాటు ప్రతి పోటీలోను ఆత్మవిశ్వాసంతో పాల్గొనాలని పట్టుదలతో విజయం సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందర్భంగా తెలిపారు. కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 68వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ పోటీలు కాకినాడ పట్టణంలో నిర్వహించుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. అధునాతన సౌకర్యాలతో రూపొందించిన ఈ స్కేటింగ్ ఇండోర్ స్టేడియంలో రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో స్కేటింగ్ పోటీలు నిర్వహించేందుకు అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుందన్నారు. వివిధ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి, మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు.కార్యక్రమంలో జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ట్రెజరర్ సీహెచ్.రమేష్, జిల్లా పిఈటి అసోసియేషన్ ప్రెసిడెంట్ రవి రాజు, జిల్లా క్రీడా సమాఖ్య సెక్రెటరీ, 68వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ లంక జార్జి, ఇతర పీఈటీలు కె.నూకరాజు, జీ.రవి సుందర్ కౌర్, జీ.సుధాకర్, కె. పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

కూనవరం పంచాయతీలో ఘనంగా పల్లె పండుగ కార్యక్రమం

కూనవరర్, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పనులతో ఇదివం ెకెప్పుడు లేని విధంగా పంచాయితీలకు కొత్త వైభవం తీసుకొస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయితీ వ్యవస్థ అభివృద్ధి పదంలో ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ తరుణంలో పల్లెపండుగ వారోత్సవా లు ప్రతి పంచాయితీలో నిర్వహస్తూ ఉపాధి హామీ నిధులతో ప్రతి ఒక్కరూ వంద రోజుల పనిని సమర్థవంతంగా వినియోగించుకొని తద్వారా గ్రామాల అభివృద్ధికి దోహదం చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పిన విధంగా పల్లెటూర్లు దేశానికి పట్టుకొమ్మలు వాటిని అభివృద్ధి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో కూనవరం సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, వైస్ ఎంపీపీ బండారు సాంబ శివరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గడ్డిపాటి ప్రసాద్, జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బుడుగుల బద్రి, ఎస్కే షరీఫ్, బిజెపి నాయకులు నోముల సత్యనారాయణ, ఏపీఓ శ్రీకాంత్ శ్రీరామ్ పవన్ అశోక్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మరిడమ్మ అమ్మవారి సన్నిధిలో హైకోర్టు జడ్జి దంపతులు ప్రత్యేక పూజలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ మరిడమ్మ అమ్మవారిని హైకోర్టు జడ్జి డా॥విఆర్‌కె.కృపాసాగర్ కుటుంబ సమేతంగా శుక్రవారం సాయంత్రం శ్రీ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కే విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి వేద ఆశీర్వచనాలు అందజేసి, శ్రీ మరిడమ్మ అమ్మవారి చిత్రపటం,ప్రసాదంఅందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు జడ్జిలు,న్యాయవాదులుదేవస్థానం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

- వేడుకల్లో పాల్గొన్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్

చింతూరు, మేజర్ న్యూస్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందిన మొదటి విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ సీనియర్ విద్యార్థులు ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రత్నమాణిక్యం తెలియజేసారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఏ గ్రూప్ చదివినా జీవితంలో నిలదొక్కుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ అభిరుచి మేరకు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని క్రమశిక్షణతో కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అవసరాలు ఉన్నా నేరుగా తనను కలవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్స్ కు ఆదర్శంగా ఉండాలన్నారు. కళాశాల వివరాలను సమగ్రంగా సభకు వివరించారు. కళాశాలలో ఈ సంవత్సరం అడ్మిషన్ పొందిన విద్యార్థులు కళాశాల నియమాలను తెలుసుకొని క్రమశిక్షణతో చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలాన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కె గణేష్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్,అర్థశాస్త్ర విభాగాదిపతి జి వెంకటరావు ఆంగ్ల విభాగాదిపతి ఆర్ నాగేశ్వరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల విద్యార్థులు అధ్యాపకులు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భారత్ ను ఘనంగా సన్మానించారు. కళాశాల కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ జి.హారతి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల జీవితాలతో చెలగాటమాడవద్దు

- సిపిఎం డిమాండ్

కూనవరం, మేజర్ న్యూస్ : కూటమి ప్రభుత్వం కాబినెట్లో ఆమోదం తెలిపి స్మార్ట్ మీటర్ల ను ఉపసంహరించుకోవాలని సీపీఎం పార్టీ కూనవరం, వి, ఆర్ పురం మండల సీపీఎం పార్టీ నాయకులు డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా కూనవరం మండలంలోని సిపిఎం కార్యాలయం నుండి బైక్ ర్యాలీగా వెళ్లి భీమవరం సబ్ స్టేషన్ వద్ద సిపిఎం నాయకులు ఆధ్వర్యంలో గంటపాటు నిరసన కార్యక్రమం చేపట్టారు.విద్యుత్ జే.ఈ రాజ కపూర్‌కి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.అనంతరం జిల్లా వి. ఆర్ పురం జిల్లా కమిటీ సభ్యులు పూనంసత్యనారాయణ, కూనవరం మండల వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్యలు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు.వరదలకు రైతులు పంట నష్టపోయి ఉన్నారని ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని రైతులు ప్రజలపై పెద్ద ఎత్తున భారం పడుతుందని అన్నారు.కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబం పై భారాలను మోపటంపై ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.. ఆదాని,అంబానికి, కట్టబెట్టడాని కే ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఈ కూటమి ప్రభుత్వ తీసుకొచ్చారని తక్షణమే ఈ స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో రైతులను ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.విద్యుత్ జె.ఈ మాట్లాడుతూ మీ సమస్యలను పై అధికారులు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రవ ంలో మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, ఎంపీటీసీ జయసుధ,ఎంపీపీ కారం లక్ష్మి, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు పంకు. సత్తిబాబు, సోడి మల్లయ్య, కారం. సుందరయ్య, పోడియం. శ్రీరామ్మూర్తి, కె. సత్యనారాయణ, కె.కాంతారావు, జి.లక్ష్మణరావు, సిహెచ్ సుబ్బారావు, ప్రకాష్ రావు, తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో వచ్చిన భూసమస్యలకు త్వరితగతిన పరిష్కారించే విధంగా చర్యలు

కొవ్వూరు, మేజర్ న్యూస్ : కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో రీసర్వేలో వచ్చిన భూసమస్యలకు త్వరితగతిన పరిష్కారించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. శుక్రవారం కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యు గ్రామ సభలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ ఎటువంటి భూ సమస్యలు అయినా పరిష్కరించే విధంగా రెవెన్యు గ్రామ సభలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ సభలో రైతుల యొక్క భూ సమస్యలను అడిగి వాటికి త్వరితగతిన పరిష్కరించే విధంగా రెవిన్యూ అధికారులు చర్యలు తీసుకుంటా మన్నారు. రైతులకు ఎటు వంటి భూ సమస్యలు రాకుండా చూసు కోవాలని మండల తాహసిల్దార్ గ్రామ రెవెన్యు అధికారి, గ్రామ సర్వేయర్లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. చిడిపి గ్రామ సభలో 18 అర్జీలు వచ్చాయని ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, మండల తాహసిల్దార్ యం.ప్రసాద్, పాలడుగుల లక్ష్మ ణరావు, వీఆర్వో బంగారు బాబు, గ్రామ సర్వేయర్ ఎ.ప్రసాద్, చిడిపి స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కాకినాడ, మేజర్ న్యూస్ : వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశం మందిరంలో అడల్ట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఖూఖూూ) ఉల్లాస్ పథకం పై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా ఉల్లాస్ పథకాన్ని రూపొందించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. దేశంలో100% అక్షరాస్యతను సాధించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉల్లాస్ పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉండి చదువు ఆపేసిన లేదా చదువుకొని పెద్దలను గుర్తించి అక్షరాస్యతను అందించి వారికి ప్రాథమిక విద్య, డిజిటల్ విద్య, మరియు ఆర్థిక విద్యను వాలంటీర్ టీచర్ ద్వారా అందించడమే ఉల్లాస్ పథక లక్ష్యమని తెలిపారు.ఇందులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాలలోని నిరక్షరాస్యులను గుర్తించడానికి రాష్ట్రవ్యాప్తంగా 4.15 లక్షల మందిని లక్ష్యంగా పెట్టుకోగా జిల్లాలోని పది మండలాలలో 6,806 మంది నిరక్షరాస్యులను గుర్తించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ముఖ్యంగా స్వ